



కో..కోట్లు



మూడు రోజులూ కోడి పందేల జాతర

సంక్రాంతి పెద్ద పండుగ మూడు రోజులపాటు ధూమ్‌ధామ్‌గా సాగింది. నోట్లు చేతులు మారాయి. కోళ్లు కత్తులు కట్టుకున్నాయి. ఎక్కడికక్కడ సందడే సందడి. చిన్నాపెద్ద తేడా లేకుండా ఈ మూడు రోజులు మురిపించారు. ఓ వైపు కోతాట, మరోవైపు గుండాట, ఇంకోవైపు పొట్టేలు, పందుల పోటీలు.. ఎక్కడికక్కడ ఏటీఎంలే కాదు జనం జేబులు ఖాళీ అయ్యాయి. మద్యం ఏరులై పారింది. తెలంగాణ మద్యం అదనంగా వచ్చిపడింది. బుల్లితెర తారలు దిగొచ్చారు. ప్రజా ప్రతినిధులు బరుల వద్ద చుట్టాలయ్యారు. పండుగ ముగిసింది ఇక చాలంటూ కనుమ సాయంత్రం ఐదు గంటలకు బరుల వద్ద పోలీసులు వచ్చి వాలారు.


వీరవాసరం మండలం నవుడూరులో బరి వద్ద కార్లు, వాహనాలు


సీసలి బరి వద్ద పార్కింగ్ చేసిన కార్లు


భీమవరం మండలం గొల్లవానితిప్పలో పెళ్లి వేడుకల తరహాలో భారీ సెట్టింగ్‌లతో ఏర్పాటు చేసిన బరి

(భీమవరం/ఏలూరు/కాళ్ల/ తాడేపల్లిగూడెం రూరల్, ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 200 బరులు ఏర్పాటు చేశారు. ఈ మూడు రోజుల్లో సుమారు రూ.300 కోట్ల వరకు చేతులు మారినట్లు అంచనా. ఇందులో కాళ్ల మండలంలోని బరుల్లో అధిక మొత్తం ఉంటుందని అంటున్నారు. సంక్రాంతి, కనుమ రెండు రోజుల్లో భారీ ఎత్తున పందేలు సాగాయి. పగలే కాకుండా కొన్ని గ్రామాల్లో రాత్రి పూట నిర్వహించేందుకు ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశారు. జాతరను తలపించేలా గ్రామాలన్నీ కోలాహలంగా మారాయి. కోడి పందేలకు వచ్చే వాహనాలతో రోడ్లన్నీ స్తంభించాయి. కాళ్ల మండలం సీసలి, పెద అమిరం గ్రామాల బరుల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. పందెంరాయుళ్లను కట్టడి చేసేందుకు బౌన్సర్‌లను ఏర్పాటు చేశారు. అతిథులకు ప్రత్యేక పాస్‌లు ఇచ్చారు. కాళ్ళకూరు, ఏలూరుపాడు, కాళ్ళ, సీసలి, కోపల్లె, జక్కరం, మోడి, పెద అమిరం, మాలవానితిప్ప గ్రామాల్లో జోరుగా పందేలు నిర్వహించారు. సీసలి, పెద అమిరం పందేలను తెలంగాణ నాయకులు తిలకించారు. పందేలను తిలకించేందుకు వచ్చిన పందెంరాయుళ్ళ, ప్రజలకు భోజనాలు ఏర్పాటు చేశారు. భీమవరం రూరల్ గొల్లవానితిప్ప బరిలో మూడు రోజులకుగాను రూ.20 కోట్లకుపైగా పందేలు సాగాయి. ఒక పందెం రూ.60 లక్షల వరకు వెళ్లింది. కోడి పందేల ముసుగులో గుండాటలు జోరుగా సాగాయి. లోన, బయట పేక ముక్కల ఆటల్లో లక్షలు చేతులు మారాయి. గెలిచిన వారు ఆనందంతో రెట్టింపు పందేలకు దిగగా, ఓడిన వారు దిగాలుగా ఇంటి ముఖం పట్టారు.



అమ్మో.. ఎంత డబ్బో

ఈ మధ్య కాలంలో కనీవినీ ఎరుగని రీతిలో నగదు ప్రవాహంగా సాగిందంటే అది సంక్రాంతి కోడి పందేల సీజన్‌లోనే. బయట ప్రపంచం మరిచిపోయిన బెట్టింగ్‌రాయుళ్లంతా తెగబడ్డారు. ఏకంగా నగదును కట్టలు కట్టలుగా తెచ్చి బెట్టింగులను కాశారు. తగినంత భద్రత తీసుకున్నారు. మొత్తం నగదును నలుగురైదుగురికి విభజించి అందుబాటులో ఉంచుకున్నారు. ఆ తరువాతే వరుస బెట్టింగులకు దిగారు. హైదరాబాదు నగరం నుంచి వచ్చిన వ్యాపారవేత్త ఒకరు 50 లక్షల నగదును సంక్రాంతి ఒక్కనాడే కోడి పందేల్లో బెట్టింగ్ కాశారు. లండన్ నుంచి వచ్చిన అతిథి ఒకరు తన అదృష్ట సంఖ్య తొమ్మిదితో తొమ్మిది లక్షలు కాసి గెలుపొందడం విశేషం. రాయచోటి నుంచి వచ్చిన వరలక్ష్మి అనే మహిళ మూడు పందేల్లో రూ.11 లక్షలు పందెంగా కాశారు. ఇలా ఎక్కడికక్కడ నగదు విచ్చలవిడిగానే సాగింది. ఇక కోసాట విషయానికొస్తే చెప్పనక్కర్లేదు. 500 నోట్లు వెల్లువలా జారిపడ్డాయి. ప్రతీ పందెం బరిలోను కోసాట ఒక్కో రోజు 35 లక్షల నుంచి 45 లక్షల మేర సాగాయి. కొన్నిచోట్ల అనుకున్న విధంగా జనం రాకపోవడంతో నిరాశపడ్డారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఒక్క కోడి పందేల్లోనే సుమారు రూ.390 కోట్ల వరకు చేతులు మారగా, పేకాటలోనూ పెద్ద మొత్తంలోనే చేతులు మారింది. గతేడాదితో పోలిస్తే ఈ మొత్తం సొమ్ము మూడు రెట్లు అధికం. ఇక గుండాట విషయంలో చెప్పనక్కర్లేదు.


పెద అమిరం బరి వద్ద గుండాట నిర్వహిస్తున్న మహిళలు

కోడికి రూ.100

పందెంలో ఓడిన కోడిని మాంసంగా మార్చే ముందు శుభ్రం ఒక్కో దానికి చేసేందుకు రూ.100 వసూలు చేశారు. గత ఏడాది రూ.20 తీసుకోగా.. ఇప్పుడు పెంచేశారు. సెలవులు కావడంతో చదువుకునే పిల్లలు ఎక్కువగా ఈ పనిని ఎంచుకున్నారు. పండుగ ఖర్చులకు వారే సంపాదించుకున్నారు.


పెదతాడేపల్లి బరిలో కారు అద్దం పగలకొట్టిన వ్యక్తిని పట్టుకున్న స్థానికులు

టెంట్‌లు, కుర్చీలకు డిమాండ్

సంక్రాంతి పేరుతో టెంట్‌లు కుర్చీలు, బల్లలకు డిమాండ్ ఏర్పడింది. కోడి పందేలు బరులు, పేకాట కేంద్రాలు ఏర్పాటుకు టెంట్‌లు, కుర్చీలు, బల్లలు అవసరం. షామియానా దుకాణాల్లో ముందుగానే బుక్ చేసుకున్నారు. టెంట్‌లకు భారీ ధరలు పలికాయి.

కోజాకు డిమాండ్

పందెంలో ఓడిపోయి చనిపోయిన కోడిని కోజాగా పిలుస్తారు. పందేలకు ముందు పందెగాళ్లు వీటికి బాదంపప్పు, జీడిపప్పు, పిస్తా, కైమా వంటి బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తారు. దీనివల్ల మంచి రుచి వస్తుందని వీటి కోసం మాంసం ప్రియులు ఎగబడుతుంటారు. ఒక్కో కోజా రూ.3000 నుంచి రూ.10 వేల వరకు పలికింది. ఏలూరు శివారులో రూ.15 వేలు పలకడం విశేషం.

బరుల దగ్గర దొంగల హల్‌చల్...

కోడిపందేల బరుల వద్ద దొంగలు హల్‌చల్ చేశారు. తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి, తాడేపల్లిగూడెం బరుల్లో జేబు దొంగలు చేతివాటం చూపారు. పెదతాడేపల్లి బరి వద్ద తెలంగాణ నుంచి వచ్చిన వారి కారు అద్దాలు పగలగొట్టి కారులో నగదు అపహరించే ప్రయత్నం చేసిన దొంగ లను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పందే లకు వచ్చిన వారి నుంచి సుమారు లక్షన్నరకు పైగా నగదు, నాలుగు సెల్‌ఫోన్‌లను చోరీ చేసినట్టు బాధితులు వాపోయారు. దీంతో తాడేపల్లిగూడెం బరిలో దొంగలను పట్టించిన వారికి రూ.50 వేల నగదు అందిస్తామని నిర్వాహకులు ప్రకటించడం కొసమెరుపు.


సీసలిలో ఏర్పాటు చేసిన భారీ బరి

ముక్కకు డిమాండ్

కిటకిటలాడిన మాంసం దుకాణాలు

నరసాపురం, జనవరి 15(ఆంధ్రజ్యోతి):కనుమ పండుగ సందర్భంగా బుధవారం నాన్ వెజ్ దుకాణాలన్నీ కిటికిటలాడాయి. జిల్లావ్యాప్తంగా అన్ని షాపుల వద్ద ఇదే రద్దీ కొనసాగింది. ప్రతి ఇంట్లో మషాల వాసనలు గుమగుమలాడాయి. స్తోమతను బట్టి చాలా మంది రెండు, మూడు రకాలు తెచ్చుకుని బంధు మిత్రులతో కలిసి భోజనాలు చేశారు. ఇటు చేపల మార్కెట్‌లోనూ ఇదే సందడి. తెచ్చిన చేపలు తెచ్చినట్లే అమ్మకాలు జరగడంతో వీటికి డిమాండ్ ఏర్పడింది. దీంతో వ్యాపారులు ధరలను పెంచేశారు.



ఎక్కువగా చికెన్, మటన్ వ్యాపారం సాగింది. చిన్న దుకాణం కూడా రూ.10 వేలకుపైనే అమ్మకాలు సాగాయి. అత్యధికంగా భీమవరంలో జరిగాయి. చాలాచోట్ల కోళ్లు అయిపోవడంతో అమ్మకాలు నిలిపివేశారు. కనుమ వ్యాపారం రూ.3 కోట్లకు పైనే సాగినట్లు అంచనా.

బరువెక్కిన గుండెలతో ..

బంధుమిత్రుల తిరుగు ప్రయాణం
బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్లు ఫుల్
రహదారులపై వాహనాల రద్దీ
ముగిసిన సంక్రాంతి




భీమవరం బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

పాలకొల్లు/ భీమవరం టౌన్ జనవరి 15(ఆంధ్రజ్యోతి) సంక్రాంతి పండుగను బంధువులతో జోష్‌గా జరుపుకుని బరువెక్కిన హృదయాలతో తిరిగి హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు ప్రయాణం చేపట్టారు. వరుసుగా సెలవులు రావడంతో మూడు రోజులు ముందుగానే సొంత ఊళ్లకు తరలివచ్చారు. సోమవారం, మంగళవారం, బుధవారం ఆనందంగా పండుగ చేసుకున్నారు. బుధవారం సాయంత్రం బ్యాగ్‌లు సర్దుకుని తిరుగు ప్రయాణమయ్యారు. కనుమ రోజు కాకైనా కదలదు అనే సామెతను పక్కన పెట్టి ఉమ్మడి పశ్చిమగోదావరి వచ్చిన వారు 90 శాతం మంది బుధవారం మధ్యాహ్నం నుంచే తిరుగు ముఖం పట్టారు. సాయంత్రం నుంచే రహదారులపై వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది.

ఆర్టీసీ 27 స్పెషల్ సర్వీసులు

హైదరాబాద్ నుంచి సొంత గ్రామాలకు వచ్చిన వారిని తిరిగి హైదరాబాద్ తీసుకువెళ్ళేందుకు ఆర్టీసీ స్పెషల్ సర్వీసులను ఏర్పాటుచేసింది. ఈనెల8 నుంచి 13 వరకు హైదరాబాద్ నుంచి జిల్లాకు 134 ప్రత్యేక సర్వీసులు నడపగా వచ్చిన వారిని తీసుకువెళ్ళేందు వచ్చే ఆదివారం వరకు స్పెషల్ సర్వీసులను ఏర్పాటు చేసింది. దాదాపు అదే రీతిలో 134 సర్వీసులు నడపాలని ఆలోచనలో ఆర్టీసీ ఉన్నతాధికారులు ఉన్నారు. బుధవారం జిల్లా నుంచి 27 సర్వీసులు నడుపుతున్నారు. ప్రతీ రోజు నడిచే 14 సర్వీసులకు అదనంగా ఈ సర్వీసులను నడుపుతున్నారు. భీమవరం డిపో నుంచి 8, నరసాపురం నుంచి 7, తణుకు నుంచి 8 , తాడేపల్లిగూడెం నుంచి 4 సర్వీసులను ఏర్పాటు చేశారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా భీమవరం బస్ కాంప్లెక్స్‌లో డీఎం సత్యనారాయణమూర్తి, సీఐ సురేష్‌లు పర్యవేక్షించారు.

మూడు రోజులు..మూడు క్షణాలుగా !

పండుగ మూడు రోజులు ముచ్చటగా మూడు క్షణాల్లో గడిచిపోయాయి. బోగి రోజు వండిన కమ్మటి వడలు, పులిహోర, పెద్దపండగ రోజున చేసిన కమ్మటి బూరెలు, సున్నుండలు, కనుమ రోజు వండి వడ్డించిన గారెలు, మాంసాహార కూరలు రుచి మరవకముందే పండుగ రోజులు క్షణాల్లో గడిచిపోయాయి. చాలా గ్రామాల్లో కులభోజనాలు జరగ్గా, పలు ప్రాంతాలలో ఇంటి పేరు వారు సహపంక్తి భోజనాలు పెట్టుకున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు నిర్వహించారు. యలమంచిలి మండల గ్రామాల్లో సామాజిక వేదికలు ఏర్పాటు చేసి, అన్ని సామాజిక వర్గాలను ఒకే వేదిక పైకి రప్పించి మూడు రోజుల్లో సుమారు 30 వేల మందికి 30 రకాల పైబడి వంటకాలు వండి వడ్డించారు. పాలకొల్లులో మంత్రి రామానాయుడు ఆధ్వర్యంలో సంప్రదాయ క్రీడలు నిర్వహించారు. కొన్ని ప్రాంతాలలో అశ్లీల నృత్యాలు జరిగాయి. మొత్తంగా ఈ ఏడాది సంక్రాంతి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగాయి.



ఎంత బతికినా చివరికి కోడిచావే..!

మారాజులా చూసుకుంటుంటే మురిసిపోయాను..
బాదం, పిస్తాలు తిని పెరిగాను..
ఏసీ రూముల్లో దర్జా వెలగబోశాను
12 పందేలు గెలిచాను..
మా యజమాని ఆనందమే నా ఆనందమనుకున్నాను..



ఓ..పుంజు ఆక్రోశం

"రాజా.. నన్ను మహారాజులా పెంచావ్.. నీ సొంత బిడ్డల కంటే ఆప్యాయత చాటావ్. వేసవి కాలం వచ్చిందంటే శీతల గదుల్లో ఉంచావు. చల్లటి నీటిలో జలకాలాడించావు. చలికాలంలో నులివెచ్చటి గదులలో నన్ను సేదతీర్చావు.మీరు తినే ఆహారం మాట ఎలాగున్నా నన్ను మాత్రం ఖరీదైన బాదం, పిస్తా, జీడిపప్పులతో పెంచావ్. నాకేదైనా కొంత నలత చేస్తే విలవిల్లాడావ్. పశువైద్యుని పిలిచి నాకు వైద్యం చేయించేంత వరకూ నీళ్లయినా తాగేవాడవు కాదు. రాజా.. నీకు గుర్తుందో లేదో గతేడాది తొలిసారిగా పందెం గెలిచినప్పుడు నీవు గర్వంగా మీసం మెలేస్తుంటే నేను ఆనందంతో ఉప్పొంగిపోయాను. నిన్ను మహారాజులా నిలబెట్టాలని కసితో పోరాడి గతేడాది పండగ మూడు రోజుల్లో 8 పందేలు గెలిచాను. నిర్వాహకులు నీకు కారు బహుమతిగా ఇస్తే అది నాదే అన్నంత సంబర పడ్డాను. నీవు కారులో కూర్చుని మెత్తటి తవల్ వేసి నన్ను నీ ఒళ్లో కూర్చోబెట్టి తీసుకెళ్తుంటే నేను కూడా మీసం మెలేయ్యాలన్నంత సంతోషం వేసింది. పందేలలో నాకు తగిలిన కత్తి గాయాలకు పసర్లు పూయించావు. నేను ఎక్కడ బలహీన పడిపోతానని పొరుగు మకాం నాయుడు గారి పుంజులకు మాదిరిగా నాకు ఆడగాలి సోకకుండా బ్రహ్మచారిగా పెంచావు. వేరే పుంజుల పెంపకాల కేంద్రాల్లో లేనటువంటి సౌకర్యాలన్నీ నాకు కల్పించి నన్ను అతి గారాబంగా పెంచావు. నీవు మన కోళ్ల పెంపకం వద్ద కూర్చున్నప్పుడు న్యూస్ పేపరు చదువుతుంటే ఆసక్తిగా ఆలకించేదాన్ని... ప్రపంచంలో ఏటా 55 వేల బిలియన్ల కోళ్లను తినేస్తారని జర్మనీ వాళ్లయితే సగటున ఏడాదికి 12 కేజీల కోడి మాంసాన్ని లాగించేస్తారని నీవు చదువుతుంటే ఆశ్చర్యపోయే దాన్ని...మా యజమాని నన్ను ఇంత గారాబంగా పెంచుకుంటే అన్ని కోట్ల కోళ్లని ఎలా తినేస్తున్నారా అని ఆశ్చర్యం కలిగేది. ప్రపంచంలో అత్యధికంగా జీవించిన కోడి వయసు 22 సంవత్సరాలని నీవు ఎవరికో చెబుతుంటే విన్న నేను మా జీవిత కాలం అందులో సగమైనా ఉంటుందని అనుకునేదాన్ని. ఇట్టే కాలం గడిచింది. జనవరి రానే వచ్చింది. మరలా పందేలకు బరులు సిద్ధమయ్యాయి.గతేడాది 8 పందేలు పొడిచిన నేను ఈ ఏడాది కొంచెం వెనుకబడ్డాను. భోగి రోజు రెండు పందేలు, సంక్రాంతి రోజున ఒక పందెం కనుమ రోజు ఒక పందెం గెలిచేటప్పటికి నాలో శక్తి 75 శాతం క్షీణించిపోయింది. నాకు పసర మందులు వేయిస్తావని పశువైద్యులను పిలిపించి వైద్యం చేయిస్తావని ఎదురు చూస్తున్న నాకు నీ పనివాడితో మాట్లాడుతున్న మాటలు నా చెవిన పడ్డాయి. నిలువెల్లా వణికిపోయాను. "ఒరేయ్ ఈ పుంజు చచ్చేట్టు ఉంది..చాలా పందేలు గెలిచినప్పటికీ ఇక భవిష్యత్తులో పందేలకు పనికిరానట్టుగా కనిపిస్తున్నది. దీని ప్రాణాలు పోక ముందే బాగా మంటలో కాల్చి కోజా మాంసం చెయ్యి. దొంగముక్క బలిసి ఉంది. 5 కేజీలకు తగ్గకుండా మాంసం అవుతుంది. ఇందులో సగం కోడి ఆవకాయ పెట్టడానికి చిన్నముక్కలుగా కొట్టించు. మిగిలిన దాంట్లో సగం పులుసు కూర, సగం ఫ్రై చేయించు.. అమెరికా నుంచి వచ్చిన మా చిన్నదానికి కోడి ఊరగాయ అంటే మహా ఇష్టం. అమెరికా పట్టుకెళ్తుంది.."అని చెబుతుంటే మానవ నిజ స్వరూపం తెలుసుకున్నాను. ఆఖరి పందెంలో సైతం ప్రాణ భయం లెక్క చేయకుండా పోరాడి గెలిచి నీ పరువు నిలబెట్టాను. నేను వీరమరణం పొందితే నాకు శ్రద్ధాంజలి ఘటిస్తావనుకున్నాను. కానీ ప్రాణం ఉండగానే కోసుకు తినాలనే ఆలోచన చూస్తుంటే ఆవేదన కంటే జాలే కలుగుతుంది. అమెరికా నుంచి వచ్చిన మీ అమ్మాయి గారు పందెం బరుల వద్ద నన్ను ఒళ్లో కూర్చోబెట్టుకుని ఫొటోలు దిగుతుంటే నన్ను ఎప్పుడైనా ఒకసారైనా అమెరికా తీసుకెళ్తారని కలలు కన్నాను. సజీవంగా వెళ్లలేనప్పటికీ నా దేహంలో కొన్ని భాగాలు అమెరికా వెళుతున్నందుకు నాకు గర్వంగా ఉంది. రాజా మిమ్మల్ని చూస్తుంటే జాలేస్తోంది..వీరమరణం పొందినా సరిపోయేది. కొన ఊపిరితో ఉండి కుటిల బుద్ధి తెలుసుకుని బాధపడటం మినహా ఏం చేయగలను. మంట సెగ నన్ను దహించి వేస్తున్నది. ప్రాణాలు గాల్లోకి పోతున్నాయి.. సెలవు" అంటూ ఓ పుంజు ప్రాణం విడిచింది..

- పాలకొల్లు (ఆంధ్రజ్యోతి)


క్రీడాకారులను పలకరిస్తున్న ఏపీ లీగల్ సర్వీస్ అథారిటీ డిప్యూటీ సెక్రటరీ

చట్టాలపై అవగాహన పెంచాలి

ఏపీ లీగల్ సర్వీస్ అథారిటీ డిప్యూటీ సెక్రటరీ అమర రంగేశ్వరరావు
న్యాయ సలహాలకు టోల్ ఫ్రీ నెంబర్ 15100

ఆకివీడు, జనవరి 15(ఆంధ్రజ్యోతి):న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించి ప్రజలకు చట్టాలపై అవగాహన పెంచాలని ఏపీ లీగల్ సర్వీస్ అథారిటీ డిప్యూటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ హెచ్.అమర రంగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆకివీడులో డీవైఎఫ్ఐ 42వ సంక్రాంతి యువజనోత్సవాలలో భాగంగా నిర్వహి స్తున్న రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీల్లో క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. 'యువత చెడు వ్యసనాలకు బానిసలవ్వకుండా తల్లిదండ్రులు మందలించాలి. 18 ఏళ్లలోపు బాలికను ప్రేమించినా, పెళ్లి చేసుకున్నా పోక్సో చట్టం ప్రకారం 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తారు. తల్లిదండ్రులకు శిక్షార్హులే. గత ఏడాది రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేకుండా వాహనాలు నడపడంతో 3,500 మంది మరణించారు. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే నేరం. ఏదైనా ప్రమాదం జరిగితే నడిపిన వాళ్లతోపాటు వాహన యజమాని శిక్షించబడతారు. వృద్ధుల రక్షణ చట్టం కింద తల్లిదండ్రులను పిల్లలు సరిగ్గా చూడకపోయినా, నెలకు ఎంతో కొంతనగదు ఇవ్వకపోయినా శిక్షార్హులు. తల్లిదండ్రుల నుంచి రాయించుకున్న ఆస్తి తిరిగి ఆర్డీవో కోర్టు ద్వారా వారు పొందే అవకాశం వుంది. 15100 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేస్తే న్యాయపరమైన సలహాలు ఉచితంగా పొందవచ్చు' అని తెలిపారు.





గుర్రపు బగ్గీ, రిక్షాపై ప్రయాణం



బొమ్మ ఎద్దుల ఆటోలో చిన్నారులు



బొమ్మ ఎద్దుల బండి




తాడేరులో కోడి బొమ్మ

సంక్రాంతి.. సంప్రదాయం

సంక్రాంతి పండుగ సంప్రదాయానికి ప్రతీక. ఉపాధి, ఉద్యోగాల్లో ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా సంక్రాంతి వేడుకలకు స్వగ్రామాలకు చేరుకుని సందడి చేశారు. పలు గ్రామాల్లో సంక్రాంతి సంబరాల్లో పాత కాలం నాటి ప్రయాణ సౌకర్యాలను ఈతరం వారికి తెలియజెప్పే ప్రయత్నం చేశారు. వీరవాసరం మండలం నవుడూరు శివారులో మూడు రోజుల పాటు నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ఆకట్టుకున్నాయి. గ్రామీణ ప్రాంతాన్ని తలపించేవిధంగా రూపొందించిన సెట్టింగ్‌లు, కోడి పుంజులు ఆకట్టుకున్నాయి. ఎడ్లబండి, గుర్రపు బండి, పాత కాలం నాటి కార్లు ప్రదర్శనకు ఉంచారు. వేడుకలకు వచ్చిన వారికి వాటిలో ఉచితంగా ప్రయాణించే అవకాశం కూడా కల్పించారు. పిల్లలు, పెద్దలు వాటిలో ప్రయాణించి కేరింతలు కొట్టారు. యలమంచిలి బొమ్మ ఎడ్లబండ్లు ఫొటో షూట్ ప్రాంతాలు ఆకట్టుకున్నాయి. పలుచోట్ల సంప్రదాయ పిండివంటలతో భోజనాలు కూడా ఏర్పాటు చేశారు. భీమవరంలో మండలంలో భారీ సైజు కోడి పుంజు బొమ్మ చిన్న పిల్లలను విశేషంగా ఆకర్షించింది. గతంలో ఎక్కడా ఇటువంటి ఏర్పాట్లు లేకపోవడంతో గ్రామాల్లో సరదగా గడిపారు.

(భీమవరం టౌన్ / భీమవరం రూరల్ / యలమంచిలి / వీరవాసరం, ఆంధ్రజ్యోతి)





ఆ తరం కారులో ప్రయాణం



ఎద్దు బండిపై అల్లుళ్ల రాక



చిన్న ఎద్దు బండిపై సవారీ

గోదావరి మర్యాదలు..!

కొత్త అల్లుళ్లకు పసందైన వంటకాలతో పండుగ విందు

452 రకాల వంటకాలు



సంక్రాంతి పండుగ కొత్త అల్లుళ్లకు మరీ ప్రత్యేకం. అత్తమామల మర్యాదలతో అల్లుడు ఉబ్బితబ్బిబ్బు కావాలిసిందే. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన వందనపు వెంకటేశ్వరరావు, సాయి బాల పద్మ దంపతులు తమ అల్లుడు, కుమార్తె కొల్లూరు శివ భాస్కర్, ప్రియాంకకు పసందైన పండుగ విందు ఏర్పాటు చేశారు. 452 రకాల భోజన పదార్థాలతో నూతన దంపతులతో పాటు బంధువులందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తారు. **- ఏలూరు, ఆంధ్రజ్యోతి**

365 రకాలు

జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన తడికమళ్ల దుర్గారావు, జ్యోతి దంపతుల అల్లుడు భరత్‌సాయి, కుమార్తె అమృత భవ్యశ్రీకి రోజుకో రకం వంటకం అంటూ మర్యాదలు చేశారు. 365 రకాల పదార్థాలతో విందు ఏర్పాటు చేశారు. **- ఏలూరు, ఆంధ్రజ్యోతి**



200 రకాలు

మొగల్తూరుకు చెందిన అనంతపల్లి ఫణి, ఝాన్సీ దంపతులు చిన్న కుమార్తె విష్ణుప్రియ అల్లుడు త్రిపురమల్లు వైష్ణవ్‌కు 200 రకాల వంటకాలతో విందు ఏర్పాటు చేశారు. వారితో పాటు పెద్ద కుమార్తె లక్ష్మీ హరిప్రియ, వినయ్ రాజ్‌కుమార్ దంపతులను ముందుగా గ్రామంలోకి ఎడ్లబండిపై ఇంటికి తీసుకెళ్లారు.
- మొగల్తూరు, ఆంధ్రజ్యోతి



174 రకాలు



ఆకివీడుకు చెందిన పేరూరి రాధాకృష్ణ, రాజ్యం దంపతులు అల్లుడికి 174 రకాల వంటకాలతో విందు రుచి చూపించారు. పెద్ద బల్లపై అరిటాకు, వెండి పళ్లెంలో ఆహార పదార్థాలు కొసరి కొసరి వడ్డించారు. అత్తారింట మర్యాదలు చూసిన అల్లుడు రాహుల్ పొంగిపోయాడు.
- ఆకివీడు, ఆంధ్రజ్యోతి



ఆచంట మండలం పెనుమంచిలి, కందరవల్లి మధ్య ప్రభల తీర్థం

వైభవంగా ప్రభల తీర్థం

ఆచంట, జనవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుమంచిలి, కందరవల్లి సరిహద్దు ప్రాంతంలో పచ్చని పొలాల మధ్య బుధవారం ప్రభల తీర్థం వైభవంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగలో కనుమ రోజు వల్లూరు, కరుగోరుమిల్లి, కోడేరు, పెనుమంచిలి, కందరవల్లి ఆలయాల నుంచి ఊరేగింపు వచ్చిన ప్రభలు అక్కడ కొలువుదీరుతాయి. ఆచంట పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున ప్రభల తీర్థానికి తరలివస్తారు. స్వామి వార్లకు పూజలు చేస్తారు. ఆయా గ్రామాల నుంచి ప్రభలు వరి చేలు, కాలువల్లో నుంచి ఊరేగింపు తరలి రావడాన్ని ప్రజలు సంభ్రమాశ్చర్యాలతో తిలకిస్తారు. కొద్ది గంటల సేపు జరిగి వేడుక ఆధ్యాత్మిక శోభకు అద్దం పడుతుంది. ఎస్ఐ కె.వెంకటరమణ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఉత్సాహంగా జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ శ్రీవేద, కొత్తపల్లి సుబ్బారాయుడు, ఆర్డీవో దాసి రాజు

నరసాపురం టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రుస్తుంబాదా కబడ్డీ స్టేడియంలో గోగులమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలను డీఎస్పీ శ్రీవేద, ఆర్డీవో దాసిరాజు ప్రారంభించారు. అంబేడ్కర్ సెంటర్ నుంచి స్టేడియం వరకు క్రీడాకారులు ర్యాలీ చేశారు. మంగళవారం జరిగిన ప్రారంభ కార్యక్ర మంలో కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ దాతలు ముందుకు గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలన్నారు. ఆర్డీవో దాసిరాజు మాట్లాడుతూ జాతీయ స్థాయిలో ఎంతో మంది క్రీడాకారుల్ని తయారుచేసిన ఘనత రుస్తుంబాదా స్టేడియంకు దక్కిందన్నారు. డీఎస్పీ శ్రీవేద మాట్లాడుతూ 30ఏళ్లుగా జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పురుషుల విభాగంలో 19, మహిళల విభాగంలో 11 జట్లు తలపడుతు న్నాయి. లీగ్‌కం నాకౌట్ పద్ధతిలో జరుగుతున్న పోటీల్లో బుధవారం మహిళ విభాగంలో వెస్ట్ బెంగాల్‌పై హర్యానా జట్టు, పురుషుల విభాగంలో వెస్ట్ బెంగాల్‌పై ఆంధ్ర జట్టు గెలుపొందాయి. కన్వీనర్ జానకి రామ్, డీఈ మధుకుమార్, తహసీల్దార్ రాజరాజేశ్వరి, నెక్కంటి సుబ్బారావు, చినమిల్లి సత్యనారాయణ, అడబాల బాబులు, వైఎస్ బాబులు, వన్నెంరెడ్డి శ్రీను, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడలకు ఆంధ్రప్రదేశ్ టీమ్ చీఫ్‌గా బడేటి

ఏలూరు రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్, రిషికేష్, హరిద్వార్‌తో పాటు సుమారు 9 రాష్ట్రాల్లో ఈనెల 28నుంచి ఫిబ్రవరి 14వరకు జరిగే 38వ జాతీయ క్రీడలకు ఆంధ్రప్రదేశ్ టీమ్ చీఫ్‌గా బడేటి వెంకటరామయ్య నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి జాతీయక్రీడల్లో పాల్గొనేందుకు మొత్తం 21 క్రీడాంశాలు అర్హత సాధించాయి. బడేటి వెంకటరామయ్య ప్రస్తుతం ఇండియన్ వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు, ఏపీ ఒలంపిక్స్ సంఘం ఉపాధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. 2010లో జరిగిన కామన్‌వెల్త్ పోటీల్లో వెయిట్‌లిఫ్టింగ్ క్రీడకు డిప్యూటీ కాంపిటిషన్ మేనేజరుగా గతంలో జరిగిన జాతీయక్రీడల్లో అనేక హోదాల్లో సేవలందించారు. ఏపీ టీమ్ చీఫ్‌గా ఎంపికైన వెంకటరామయ్యను ఆంధ్రప్రదేశ్ వెయిట్ లిఫ్టింగ్ సభ్యులు, జిల్లా ఒలంపిక్ సభ్యులు, అనేక జిల్లాల క్రీడాసంఘాల ప్రతినిధులు, రాష్ట్ర వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి డీన్‌బాబు అభినందించారు.



మూడు తరాల హీరోలతో నటించా



చిట్టిబాబుతో చిట్‌చాట్

సంక్రాంతి వేడుకల్లో బంధువుల పలకరింపులు, విందు, వినోదాలు, సంప్రదాయాలు సంతృప్తినిచ్చాయి. స్వస్థలం అమలాపురం అయినా ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిజాంపేటలో స్థిరపడ్డా. సంక్రాంతిని పశ్చిమలో ఆనందంగా గడపడం తనకు మరువలేని జ్ఞాపకమని హాస్యనటుడు పుణ్యమూర్తుల సూర్యనారాయణమూర్తి (చిట్టిబాబు) అన్నారు. వాలమూరు జాతరలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనను ఆంధ్రజ్యోతి పలకరించింది.

● సినీ ప్రస్థానం ఎలా సాగుతోంది..?

సినీ పరిశ్రమలో మూడు తరాల హీరోలతో నటించా. అక్కినేని నాగేశ్వరరావు ఆయన కుమారుడు నాగార్జున, ఆయన కుమారుడు అఖిల్‌తో నటించా. ఎన్‌టీఆర్‌తో నటించా. ఆయన కుమారుడు బాలకృష్ణ, ఎన్‌టీఆర్ మనవడు జూనియర్ ఎన్‌టీఆర్‌తో కూడా నటించాను. దర్శకుడు రాఘవేంద్రరావు తండ్రి కెఎస్‌ప్రకాశరావు దర్శకత్వం, రాఘవేంద్రరావు దర్శకత్వం, ఆయన కుమారుడు ప్రకాష్ దర్వకత్వంలో నటించా.

● మీ స్వస్థలం.. విద్యాభ్యాసం..?

పుట్టింది అమలాపురం. చదువు అంతా ద్రాక్షారామం, రామచంద్రాపురం, రాజమహేంద్రవరంలో సాగింది. ఐటీఐ ఎలక్ట్రికల్ చదివా. రాజమండ్రిలో అప్రంటిస్ చేసి ఉద్యోగం కోసం హైదరాబాద్ వెళ్లిపోయా.

● నటనానుభవం..?

నాటకాల్లో వేషాలతో నటనానుభవం ఉంది. హైదరాబాద్‌లో సాయంత్రం కళాశాలల్లో పీయూసీ, డిగ్రీ పూర్తి చేశా. ఆసందర్భంలో నాటకాలు వేశా. ఆడది నాటకంలో ఉత్తమ హాస్యనటుడి అవార్డు, సాంస్కృతిక విభాగంలో బంగారు పతకం సాధించా.

● సినీ రంగ ప్రవేశం..?

మాఅన్నయ్య రాజబాబు నటించిన పల్లెటూరు బావ చిత్రం హైదరాబాద్‌లో షూటింగ్ చేస్తున్నారు. ఆ చిత్రంలో మా అన్నయ్యకు బావమరిదిగా (రమాప్రభ తమ్ముడిగా) నటించారు. తరువాత మరపు రాని మనిషి చిత్రంలో మా అన్నయ్యకు తమ్ముడుగా నటించాను.

● సినిమాల్లో హాస్యానికి ప్రాధాన్యం..?

పూర్వం హాస్యానికి ఎంతో ప్రాధాన్యం ఉండేది. సినిమాలో ఒక భాగం. హాస్య నటులు తప్పనిసరి. ఇప్పుడు హాస్య నటుల అవసరం తగ్గింది. ఫైటింగ్‌లు, పాటల ముందు హాస్య రసం చిన్నబోయింది. చిత్రంలో హీరోలే హాస్యం చేస్తున్నారు.

● సినిమాపై టీవీల ప్రభావం..?

పూర్వం కొత్త అల్లుళ్లు వచ్చినా, పండగల్లో అందరూ కలిసి సినిమాలకు వెళ్లేవారు. టీవీ రాకతో థియేటర్లకు వచ్చే వారి సంఖ్య తగ్గిపోతోంది. టీవీ సినిమా రంగాన్ని తెలియని దెబ్బతీసిందని చెప్పవచ్చు. ఇప్పుడు స్మార్ట్ ఫోన్లు, కంప్యూటర్ల ప్రభావం ఉంది.

భీమవరం టౌన్, ఆంధ్రజ్యోతి





పార్వేటి ఉత్సవానికి ఉభయదేవేరులతో బయలుదేరిన శ్రీవారు, స్వామి అమ్మవార్లకు పూజలు

నయనానందకరం.. పార్వేటి ఉత్సవం



భక్తులకు గజలక్ష్మి ఆశీర్వాదం



ఊరేగింపులో అలరించిన వేషధారణలు

ద్వారకాతిరుమల, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): చిన్న వెంకన్నకు పార్వేటి మహోత్సవం (కనుమ ఉత్సవం) బుధవారం కనుల పండువగా జరిగింది. ఆలయంలో ఉభయదేవేరులతో శ్రీవారిని రాజాధిరాజ వాహనంపై ఉంచి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా గజ, అశ్వ వాహనాలపై పురవీధులకు పయనమయ్యారు. తిరువీధుల్లో దర్శనమిచ్చిన శ్రీవారు దొరసానిపాడు గ్రామానికి తరలివెళ్లారు. కనుమ మండపంలో ప్రత్యేక వేదికపై స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీవారు గిరిప్రదక్షిణగా శేషాచలకొండ మార్గంలో ఆలయానికి చేరుకున్నారు. ఈ ఉత్సవం ఆద్యంతం భక్తులను పరవశింపజేసింది.







మావుళ్లమ్మ ఆలయ వార్షిక మహోత్సవాల్లో విద్యుత్ కాంతులు, అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కిటకిటలాడిన మావుళ్లమ్మ ఆలయం

భీమవరం టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మావుళ్లమ్మ ఆలయం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. సంక్రాంతికి స్వగ్రామాలకు వచ్చిన ప్రజలు అమ్మవారిని అమ్మవారిని దర్శించుకునేందుకు తరలి వచ్చారు. శ్రీనివాస కూచిపూడి నృత్య నికేతన్ బృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం హైదరాబాద్‌కు చెందిన సినీ కొరియాగ్రాఫర్, కూచిపూడి బృందం నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఉత్సవ ఏర్పాట్లు, భక్తుల సౌకర్యాలను ఆలయ ఈవో బుద్ధా మహాలక్ష్మి నగేశ్ పర్యవేక్షించారు. వన్‌టౌన్ సిఐ నాగరాజు ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.



మావుళ్లమ్మ ఉత్సవాల్లో అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

లేడీ బౌన్సర్ల హల్‌చల్





సినిమా ఫంక్షన్ కాదు.. నటుల సందడి లేదు.. సెలబ్రిటీలు లేరు. అక్కడంతా జన సందోహం. అదంతా కోడిపందేలు జోరు. జనం రద్దీతో పందేలకు ఆటంకం లేకుండా బౌన్సర్లు ఉన్నారు. వారిలో బౌన్సర్లు ఉండడమే విశేషం. తాడేపల్లిగూడెం ప్రాంతంలో లేడి బౌన్సర్‌ల ఏర్పాటు చర్చనీయాంశమైంది. **- తాడేపల్లిగూడెం రూరల్, ఆంధ్రజ్యోతి**


మీనవల్లూరులో కోడి పందేలు


ఆకివీడులో పందెం తిలకిస్తున్న మాజీ మంత్రి రంగరాజు


ఓగిడి గ్రామంలో గుండాట ఆడుతున్న యువకులు


తేతలి బరిలో కోడి పుంజులతో మహిళలు


వీవర్స్ కాలనీ బరిలో శ్రీముఖి, ముక్కు అవినాష్

యథేచ్ఛగా పందేలు.. చేతులు మారిన కోట్లు

» కోడి పందేల బరుల్లో పేకాట, గుండాట.. » పలు చోట్ల ఎల్ఈడీ స్క్రీన్ల ఏర్పాటు.. » సందడి చేసిన జబర్దస్త్ టీం

నరసాపురం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతంలో కోడి పందేల ముసుగులో గుండాట, పేకాట నిర్వహించారు. పట్టణ పరిధిలో వీవర్స్ కాలనీ, లక్ష్మణేశ్వరం సరిహద్దున రెండు భారీ బరులు ఏర్పాటు చేశారు. అయితే సందడి అంతా వీవర్స్ కాలనీ బరిలోనే కనిపించింది. సినీ గాయకులతో ఆర్కెస్ట్రాలు ఏర్పాటు చేశారు. జబర్దస్ టీం సందడి చేసింది. శ్రీముఖి, అవినాష్, నరేష్, సుధాకర్, బుల్లెట్ భాస్కర్ తదితర కళాకారులు హాస్యంతో కడుపుబ్బ నవ్వించారు. రుస్తుంబాద బరిలో ఉప్పల్ బాలు పందెం రాయుళ్లను ఉత్తేజపర్చారు. వినోద కార్యక్రమాలు ఎక్కువగా ఇక్కడే ఉండటంతో ఈ బరిలోనే ఎక్కువగా గుండాట, కోడి పందేలు జరిగాయి. 3 రోజుల పాటు బరుల వైపు చూడని పోలీసులు బాస్‌ల ఆదేశంతో సాయంత్రం 4గంటల నుంచే మూసివేయాలని ఆదేశాలు ఇచ్చారు.

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు, వెలగలేరు, ఆలమూరు, పెనుమంట్ర, వివి పాలెం, నత్తా రామేశ్వరం, జుత్తిగ గ్రామాల్లో కోడి పందేలు జోరుగా సాగాయి. కోడిపందేల ముసుగులో గుండాట, పేకాట నిర్వహించారు.

తణుకు రూరల్: తణుకు మండలంలో జోరుగా పందేలు నిర్వహించారు. బరుల వద్ద ఎక్కువగా గుండాట, పేకాట, కోతాట విచ్చలవిడిగా నిర్వహించారు. వైరస్ కారణంగా చాలా కోడి పుంజులు చనిపోవడంతో ఇతర జిల్లాల పుంజులపై పందెంరాయుళ్లు ఆధారపడ్డారు. మహిళలు కూడా అధిక సంఖ్యలో వీక్షించారు.

పెంటపాడు: మండలంలోని పెంటపాడు, అలంపురం, ప్రత్తిపాడు, రాచర్ల, మీనవల్లూరు, రామచంద్రపురం, దర్శిపర్రు, జట్లపాలెం, పడమరవిప్పర్రు గ్రామాల్లో బరులు వెలిశాయి. జోరుగా గుండాట, పేకాట సాగాయి. మద్యం ఏరులై పారింది. లక్షలాది రూపాయలు చేతులు మారాయి.

అత్తిలి: అత్తిలి, కెఎస్ గట్టు, గుమ్మంపాడు, కొమ్మర తదితర గ్రామాలలో కోడిపందేలు నిర్వహించారు. అత్తిలి సూరపరాజు మిల్లు ఆవరణలో నిర్వహించిన కోడిపందేల్లో వీక్షకుల కోసం ప్రత్యేకంగా గ్యాలరీలు ఏర్పాటు చేశారు. కోడిపందేలతో పాటు పేకాట, గుండాట వంటి జూదక్రీడలు నిర్వహించారు. మాంసాహార ప్రియులకు ప్రత్యేకంగా దుకాణాలు వెలిశాయి. పందేలు జరిగే మిల్లు ప్రాంతం వాహనాలతో నిండిపోయింది. బరుల వద్దకు పోలీస్‌లు కానరాలేదు.

ఇరగవరం: మండలంలో కోడిపందేలు ముమ్మరంగా సాగాయి. పలు ప్రాంతాల్లోని బరుల వద్ద వీక్షించేందుకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. కాగా కోడిపందేల స్థావరాలపై దాడులు నిర్వహించి 20 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఇరగవరం ఎస్ఐ జానా సతీష్ తెలిపారు. పందెం రాయుళ్ళ నుంచి నగదు, కోడి పుంజులు, కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

యలమంచిలి: మండలంలోని కలగంపూడి, యలమంచిలి, వడ్డిలంక, బూరుగుపల్లి, నార్నిమెరక గ్రామాల్లో బుధవారం బరుల వద్ద కోడిపందేలు, గుండాట జోరుగా సాగాయి. ఆయా బరుల వద్ద లక్షలాది రూపాయలు చేతులు మారాయి. బరుల వద్ద నాన్‌వెజ్ వంటకాలు, మద్యం విక్రయాలు సాగాయి. బరుల సమీపంలో ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ జాం సమస్య తలెత్తింది.

మొగల్తూరు: మండలంలో కోడిపందేలు, జూదం యథేచ్ఛగా జరిగింది. ఇతర రాష్ట్రాల నుంచి బంధుమిత్రులు, వ్యాపారవేత్తలు పందేలు పాల్గొన్నారు.

ఆచంట: నియోజకవర్గంలో పలు చోట్ల కోడిపందేలు, గుండాట యథేచ్ఛగా సాగాయి. ఎక్కువ మంది డబ్బులు పోగొట్టుకున్నారు. మద్యం షాపులు కిటకిటలాడాయి.

ఆకివీడు: ఆకివీడులో మూడ్రోజులు కోడి పందేలు జోరుగా సాగాయి. పందేం కోళ్ళు రక్తమోడి నేలకొరిగాయి. మద్యం ఏరులై పారింది. గుండాట, మూడు ముక్కలాట, కోతాట వంటి జూదం జోరుగా సాగింది.



సోమేశ్వరస్వామిని దర్శించుకున్న కలెక్టర్

భీమవరంటౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : పంచారామ క్షేత్రమైన గునుపూడిలోని సోమేశ్వర స్వామివారిని బుధవారం కలెక్టర్ చదలవాడ నాగరాణి దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆలయ అర్చకులు ఆమెకు ఆశీర్వచనాలు అందించారు. ఆలయ ఇవో కృష్ణంరాజు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వేల్పూరు రోడ్డులోని అక్కమాంబ టెక్స్‌టైల్స్ సమీపాన బుధవారం రెండు మోటారు సైకిళ్ళు ఢీకొని ఇద్దరు గాయపడడంతో అదే రోడ్డులో వెళుతున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తన కారును ఆపి క్షతగాత్రులకు సపర్యలు చేశారు. అనంతరం తణుకు జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి సహృదయతను పలువురు కొనియాడారు.

కోడి పందేలు నిషేధించాలి

తణుకు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయం పేరిట నిర్వహిస్తున్న కోడిపందేలు, ఇతర జూద క్రీడలను నిషేధించాలని న్యాయవాది కౌరు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు కోడిపందేలపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.



ఘనంగా ఉరుసు

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురంలో మస్తాన్ బాబా ఉరుసు ఉత్సవాల సందర్భంగా గుర్రంపై గంధం ఊరేగింపు సాగింది. ఈ ఉత్సవాలను దర్గా పోషకులు అబ్బిన నాగమణి, రాజీవ్‌లు పర్యవేక్షించారు. బాణసంచా, మేళతాళాలతో ఊరేగింపు జరిగింది.



దుప్పట్ల వితరణ

కాళ్ళ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జక్కరం సర్పంచ్ కూచంపూడి లక్ష్మీపతిరాజు మాతృమూర్తి బంగారమ్మ జ్ఞాపకార్థం బుధవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సుమారు 150 మందికి కుటుంబ సభ్యుల చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. కూచంపూడి శ్రీనివాసరాజు, పెదబాబు, సతీష్, అభిరుచి కాశీ, వేంపాడు ఉప సర్పంచ్ వేగేశ్న సుమన్, వి.రఘు, కనుమూరి సునీల్ మాధుర్, నంద్యాల శ్రీనివాసరాజు, కె. శ్రీహరిరాజు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉత్సవాలు

ఆచంట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకుని శేషమ్మచెరువు శివారు పెళ్ళికూతురు అమ్మవారి చెరువు వద్ద బుధవారం భారీగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

జాతరలు..

పెంటపాడు: ఉమామహేశ్వరంలో పెంట్లమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్ద రాయుడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమ తులు అందజేసారు. రావిపాడులో ముత్యాలమ్మ జాతర నిర్వహించారు.

అత్తిలి: బల్లిపాడులో పుంతలో ముసలమ్మ ఊరేగింపు బుధవారం వైభవంగా జరిపారు. మేళతాళాలు, ఆసాదుల గరగనృత్యాలతో జాతర నిర్వహించారు.

యలమంచిలి: యలమంచిలిలో పుంతలోముసలమ్మ జాతర మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. వీధుల్లో బాణాసంచా, తీన్‌మార్ డప్పులు, గరగ నృత్యాలతో అమ్మవారి జాతర చేశారు.

దాత సహకారం మరువలేం : ఆరిమిల్లి



అత్తిలి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామ దేవత పల్లాలమ్మ ఆలయ అభివృద్ధికి దాతల సహకారం మరువరానిదని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. బుధవారం అత్తిలి మండలం కొమ్మరలో మెయిన్‌రోడ్డు నుంచి చేలల్లోని పల్లాలమ్మ ఆలయం వరకు రోడ్డు నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. గ్రామానికి చెందిన కోసూరి రామలింగ రాజు రూ. 20 లక్షలతో రోడ్డు ఏర్పాటుకు భూమిని సేకరించి రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అనంతరం గ్రామంలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేశారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ముదునూరి బాలకృష్ణంరాజు, పార్టీ అధ్యక్షుడు ఆనాల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. కొమ్మరలోని దుర్గమ్మను ఎమ్మెల్యే ఆరిమిల్లి దర్శించుకుని పూజలు జరిపారు. స్థానికులు ఆలయం వద్ద ఉన్న కాలువ రేవును అభివృద్ధి చేయాలని, ఆలయ సమీపంలో ఉన్న నాన్‌వెజ్ దుకాణాన్ని తొలగించాలని ఎమ్మెల్యేను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. పాలూరు గ్రామదేవత ముత్యాలమ్మ జాతర మహోత్సవాలు బుధవారం ప్రారంభం అయ్యాయి. అమ్మవారిని ఎమ్మెల్యే ఆరిమిల్లి దర్శించుకున్నారు.


పారిశుధ్య కార్మికుల్ని సన్మానిస్తున్న గంటా, విప్ నాయకర్, కొత్తపల్లి

తల్లిదండ్రులను ఆదరించాలి

నరసాపురం, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో తల్లిదండ్రుల్ని ఆదరించే పిల్లలకు భగవంతుడు అంతా మంచే చేస్తాడని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని మునిసిపల్ ఆడిటోరియంలో మంగళవారం చెరుకూరి లక్ష్మణరావు ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. విప్ నాయకర్ మాట్లాడుతూ తల్లితండ్రుల పేరున ట్రస్టు పెట్టి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి మాట్లాడుతూ నరసాపురం పట్టణానికి డాహెర్తి తీర్చిన ఘనత లక్ష్మణరావుకే దక్కుతుందన్నారు. అనంతరం 150 మంది పారిశుధ్య కార్మికుల్ని సన్మానించి వారికి బట్టలు పంపిణీ చేశారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, ఛైర్‌పర్సన్ వెంకటరమణ, కమిషనర్ అంజయ్య, ట్రస్టు ఛైర్మన్ రంగనాథ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా చెడుగుడు పోటీలు



తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఉప్పరగూడెంలో రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు రెండో రోజు బుధవారం రసవత్తరంగా జరిగాయి. గురువారం ఫైనల్స్ జరగనున్నాయి. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. పోటీలను సర్పంచ్ దండే కనకబాబు, టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు దండే కోటయ్య, బీజేపీ ఎస్సీ మోర్చ మండల అధ్యక్షులు దండే ఏసు రత్నం, వైసీపీ నాయకులు శాంతారావు, దండే చినగోతియ్య తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడు: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగంలో డీవైఎఫ్ఐ నిర్వహిస్తున్న 42వ సంక్రాంతి యువజనోత్సవాల్లో భాగంగా రాష్ట్రస్థాయి చెడుగుడు, కృష్ణా-పశ్చిమ గోదావరి జిల్లాల స్థాయి వాలీబాల్ పోటీలు బుధవారం హోరాహోరీగా జరిగాయి. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా సీనియర్ నాయకులు బొక్కా సత్యనారాయణ మాట్లాడుతూ డీవైఎఫ్ఐ శ్రేణులు ఎన్నో వ్యయప్రయాసలు చేకూర్చి సంప్రదాయ క్రీడలు నిర్వహిస్తున్నారన్నారు. కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, డోకల రవితేజ, బొక్కా వర్మ, బొడ్డుపల్లి రాంబాబు, గేదల ధనుష్, బాజీ, వల్లీ తదితరులు పాల్గొన్నారు.



తెలుగు భాషాభివృద్ధికి గిడుగు విశేష సేవలు

భీమవరం టౌన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగు భాషాభివృద్ధికి విశేష సేవలందించారని ప్రముఖ తెలుగు పండితులు కలిగొట్ల గోపాల శర్మ అన్నారు. శ్రీ విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో వీరమ్మ పార్కులోని తెలుగు తల్లి విగ్రహం వద్ద గిడుగు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు భాషాభివృద్ధి సంఘం నాయకులు చెరుకువాడ రంగసాయి, కళా రంజని నాటక పరిషత్ అకాడమీ సభ్యులు జవ్వాది శ్రీనివాస్, చైతన్య భారతి నాటక పరిషత్ సభ్యులు భట్టిప్రోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కళాకారులకు మంత్రి నిమ్మల సత్కారం



పాలకొల్లు టౌన్/రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంత్రి నిమ్మల రామానాయుడు మూడు రోజులు పాటు స్థానిక బీఆర్ఎంవీ స్కూల్‌లో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు ముగిశాయి. మంత్రి రామానాయుడు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ముగ్గుల పోటీలు, ఎమ్మెల్యే కప్ వాలీబాల్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కళాకారులను సన్మానించారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, సినీ గాయకుడు అనంత శ్రీరామ్, నిర్మాత వాకాడ అప్పారావు, నరసాపురం ఆర్డీవో దాసి రాజు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, యిర్రింకి సూర్యారావు హాజరయ్యారు. ఆగర్రులో రూ.2.30లక్షలతో నిర్మించిన గోకులం షెడ్డును మంత్రి నిమ్మల రామానాయుడు ప్రారంభించారు. గత ప్రభుత్వంలో కేవలం 268 షెడ్లు నిర్మిస్తే కూటమి ప్రభుత్వంలో కేవలం 6నెలల్లో 12,500 షెడ్లను నిర్మించిందన్నారు. మండలంలోని చందపర్రు, ఆగర్రు గ్రామాల్లో రూ.75లక్షల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే పితాని

ఘనంగా సంక్రాంతి వేడుకలు



ఆచంట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆచంట మండలం కొడమంచిలి జడ్పీ హైస్కూలు పూర్వ విద్యార్థులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం సాయంత్రం ముగింపు సభలో ఎమ్మెల్యే పితాని పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

గణపవరం: మండలంలో సంక్రాంతి పండుగను ప్రజలు ఆనందోత్సాహాలతో నిర్వహించారు. పిప్పరలో మాజీ మంత్రి ఇందుకూరి రామకృష్ణంరాజు గంగిరెద్దుల విన్యాసాలను తిలకించి మాట్లాడుతూ సంప్రదాయాల పరిరక్షణకు అందరూ కృషి చేయాలన్నారు. ఇందిరమ్మ కాలనీలోని శ్రీకృష్ణ ఆలయంలో యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు భైరబోయిన మాల్యాద్రి యాదవ్ గోపూజలు నిర్వహించారు. సరిపల్లెలోని టీటీడీ కల్యాణ మండపంలో గోపూజలు జరిగాయి. అఖిల భారత హ్యాండ్లూమ్స్ బోర్డు మాజీ డైరెక్టర్ నంద్యాల రామలింగరాజు, దేవస్థానం అధికారి రోహిత్‌రాజు, అర్చకులు పాల్గొన్నారు.


విదేశాల్లో ఉంటూ సంక్రాంతికి స్వగ్రామం కొడమంచిలి వచ్చిన చిలుకూరి, పైడిపాటి కుటుంబాలు



విదేశాల నుంచి సొంతూళ్లకు వచ్చి..


మొగల్లులో..

పాలకోడేరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): మొగల్లు గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ పెనుమత్స రామకృష్ణంరాజు కుమారులు మలేషియా, అమెరికా, బెంగుళూరు, హైదరాబాద్‌లలో స్థిరపడ్డారు. వారంతా స్వగ్రామం చేరుకుని సంక్రాంతి వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. ఇలా ప్రతి ఇంటిలోను ఎక్కడెక్కడో ఉన్న బంధువులంతా స్వగ్రామం చేరుకుని పండుగ జరుపుకున్నారు.

ఆచంట: కొడమంచిలికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ చిలుకూరి శాంతారామ్, రిటైర్డ్ డాక్టర్ మదు సూదనరావు అన్నదమ్ములు. వీరంతా అమెరికాలో స్థిరపడ్డారు. అలాగే కొడమంచిలికి చెందిన పైడిపాటి కార్తీక్, అచ్చన ఆద్యా కుటుంబీకులు ఆస్ట్రేలియాలోని సిడ్నీలో స్థిరపడ్డారు. వీరంతా సంక్రాంతి సందర్భంగా స్వగ్రామానికి వచ్చినట్లు తెలిపారు.


లంకలకోడేరులో 1981-82 బ్యాచ్ విద్యార్థులు


మొగల్తూరు ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు


చినకాపవరం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

పాలకొల్లు రూరల్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తాము చదివిన పాఠశాల అభివృద్ధికి పూర్వవిద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమని ఎంఈవోలు గుమ్మళ్ల వీరాస్వామి, గంగాధర శర్మ అన్నారు. లంకలకోడేరు జడ్పీ హైస్కూలులో 1981- 82 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రూ.4 లక్షల విరాళంతో భోజన బల్లలు, వంటశాల ఆధునీకరణ పనులను ఎంఈవోల చేతుల మీదుగా ప్రారంభించారు. పూర్వవిద్యార్థులు బివి త్రినాధరావు, నడింపల్లి శ్రీనివాసరాజు, గాదిరాజు శ్రీనివాసరాజు, కెల్లా సింహాచలం, ద్రోణంరాజు బలరామప్రసాదు, బంగారు గోపి, దాట్ల పద్మజ, ఆదుర్తి విజయలక్ష్మి, వనిశెట్టి శ్యామలాదేవి పాల్గొన్నారు.

మొగల్తూరు: మొగల్తూరులోని శ్రీపెన్మత్స రంగరాజా జడ్పీ హైస్కూల్‌లో 1982-83 సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు అదే పాఠశాలలో బుధవారం కలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. ఇదే బ్యాచ్ విద్యార్థి వర్ధమాన రవిశంకర్ సర్కార్ ప్రస్తుతం ఇదే పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్నారు. సమ్మేళనానికి కృషి చేసిన అనంతపల్లి బద్రినాథ్, వెలిగట్ల త్రినాథ్‌ను అభినందించారు.

ఉండి: ఉండి గోరింతోటలోని చినకాపవరం హైస్కూల్ 1978-79 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు పాఠశాలలో కలుసుకుని ఆనందంగా గడిపారు. కె.రామకృష్ణ, కె.ప్రసాద్, కటారి వెంకటకృష్ణ, కెఎస్ఎన్ రంగరావు (లెక్చరర్), కటిరెడ్డి రామకృష్ణ (జర్నలిస్ట్), మోహన్‌రంగారావు, దండు గోపాలకృష్ణంరాజు, క్షీరసాగర్, వెంకట్రాజు, మంచాల సత్యనారాయణ, నాగేశ్వరరావు, మల్లికార్జునరావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


'ఢీ' ఫేం తేజస్విని డాన్స్

మూల స్థానేశ్వరి ఆలయంలో ఘనంగా సంబరాలు

యలమంచిలి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): యలమంచిలి శ్రీమూలస్థానేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. సుందరంగా తీర్చిదిద్దిన స్వాగత ద్వారాలు.. సంప్రదాయం ఉట్టిపడేలా ఏర్పాటుచేసిన ఆకృతులు.. సకుటుంబసమేతంగా విచ్చేసిన అతిథుల సందడితో ప్రాంగణమంతా సంక్రాతి శోభ వెల్లివిరిసింది. మహిళలు, యువత, చిన్నారులు సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు. ఢీ ఫేం తేజస్విని డాన్స్, జబర్దస్త్ కామెడీ షో, సినీ సంగీత విభావరి తదితర వినోద కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. దూరప్రాంతాల నుంచి వచ్చిన వారికి టిఫిన్స్, నాన్‌వెజ్ భోజనాలు, టీ, స్నాక్స్, 27 రకాల సంప్రదాయ స్వీట్, హాట్‌లను అందించారు. వివిధపోటీల్లో విజేతలకు 9 గోల్డ్ కాయిన్స్ అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్న సుమారు 5400 మహిళలకు బహుమతులు అందజేశారు.

క్రైమ్ కార్నర్

లారీ ఢీకొని వృద్ధుడి మృతి

పాలకోడేరు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వృద్ధుడిని లారీ ఢీకొనడతంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన విస్సాకోడేరులో మంగళవారం జరిగింది. పోడూరు మండలం కొమ్ముచిక్కాలకు చెందిన కుచ్చర్లపాటి సోమరాజు (64) భీమవరం నుంచి మోపెడ్‌పై పాలకొల్లు వైపు వెళ్తుండగా విస్సాకోడేరు వద్ద లారీ డ్రైవర్ సోమరాజును బలంగా ఢీకొట్టాడు. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందినట్లు ఏఎస్ఐ మోహనరావు తెలిపారు. సోమరాజు బంధువు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పలుచోట్ల జూదరుల అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలంలో పలు గ్రామాల్లో కోడి పందేలు, జూద క్రీడలు ఆడుతున్న 16 మందిని రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.10,010 నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై ప్రసాద్ తెలిపారు. 5 కోడి పుంజులు, 10 కత్తులు స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. పడాలలో ఇద్దరిని అదుపులోకి తీసుకుని రూ.1070 నగదు, కొమ్ముగూడెంలో ఇద్దరు వ్యక్తులు, 1320 నగదు, బంగారుగూడెం ఇద్దరు వ్యక్తులు రూ.1220 నగదు, వీరంపాలెంలో ఇద్దరు వ్యక్తులు, రూ.1400 నగదు, లింగారాయుడు గూడెం ఇద్దరు వ్యక్తులు రూ.1600 నగదు, స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారితో పాటు కుంచనపల్లిలో గుండాట ఆడు తున్న ఇద్దరిని పట్టుకుని వారి నుంచి రూ.1000 నగదు, పుల్లాయిగూడెం లో ఇద్దరు వ్యక్తులు 1250 నగదు, పెదతాడేపల్లిలో కోత బంతి ఆడుతున్న ఇద్దరు వ్యక్తులు రూ.1150 నగదును స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ పోలీసులు స్పష్టం చేశారు.

పెంటపాడు: కోడిపందాలు, గుండాటలకు సంబందించి 18 కేసులలో మొత్తం 36 మందిని అరెస్టు చేసినట్లు పెంటపాడు ఎస్ఐ స్వామి తెలిపారు. వీరి నుండి 16 కోళ్ళు, నగదు రూ 18,920లు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

వాహనం ఢీకొని ఆబోతు మృతి

తణుకు, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై చివటం-షర్మిష్ట సెంటర్ మధ్య ఆబోతును గుర్తుతెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆబోతుకు వైద్యం చేయించేందుకు గోసేవకులు ప్రయత్నించగా అప్పటికే అది మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఆబోతు కళేబరాన్ని పట్టణంలోని డంపింగ్ యార్డు వద్ద పూడ్చాలని గో సేవకులు మున్సిపల్ అధికారులను కోరారు.